

వేసవి భత్యానికి మంగళం?

గ్రామాల్లో వలసలను నివారించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం తీసుకొచ్చింది.
8లో▸



పదేళ్ల తర్వాత..

మిషన్ భగీరథతో ఆగిన కాగ్నా రక్షిత మంచి నీటి పథకాన్ని పదేళ్ల తర్వాత తిరిగి శనివారం ప్రారంభించారు.
8లో▸



పాతాళానికి జలం

ఎండ తీవ్రత పెరగడంతో చెరువులు, కుంటలు, జలాశయాల్లో నీళ్లు అడుగంటి పోయాయి.
9లో▸

న్యూస్‌రీల్

అభివృద్ధిలో రాజీపడం

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: వికారాబాద్ నియోజకవర్గ అభివృద్ధిలో రాజీ పడే ప్రసక్తే లేదని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే యాదవరెడ్డితో కలిసి మాట్లాడారు. జిల్లా నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నందున నిధులకు కొరత ఉండదన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు, రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యేలా చూస్తామన్నారు.ఎన్నికల హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని తెలిపారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, సీనియర్ నాయకులు నరోత్తంరెడ్డి, సుభాష్ గౌడ్, మహేందర్‌రెడ్డి, సురేందర్, చంద్రయ్య, సిరాజొద్దీన్, మల్లారెడ్డి, వెంకట్, మాణయ్య, మల్లయ్య, ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ చేవెళ్ల అభ్యర్థిగా మీర్ మహమూద్ అలీ ?



వికారాబాద్: చేవెళ్ల లోక్‌సభ బరిలో ఉండాలని బీఎస్పీ భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే పలువురు నేతలు ఆ పార్టీ టికెట్ కోసం ప్రయత్నిస్తుండగా ఉమ్మడి రంగారెడ్డి జెడ్పీ మాజీ కో–ఆప్షన్ సభ్యుడు, ముస్లిం మైనార్టీ నాయకుడితో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. పరిగికి చెందిన మహ్మద్ మీర్ మహమూద్ అలీ ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్నారు. ఇటీవల ఆయనతో చర్చలు జరిపిన బీఎస్పీ నేతలు త్వరలో నిర్ణయం ప్రకటించనున్నట్లు సమాచారం.

సీఎంఆర్‌ను ఎప్పటికప్పుడు అందజేయాలి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

పరిగి: సీఎంఆర్ (క్లస్టర్ మిల్లింగ్ రైస్)ను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి అందజేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మిల్లర్లకు సూచించారు. శనివారం మండలంలోని న్యూ ఇండియన్, శివశక్తి రైసు మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజువారి సీఎంఆర్ మిల్లింగ్ సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేసి ఎఫ్‌సీఐకి సకాలంలో చేరవేయాలని ఆదేశించారు. మిల్లర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం

నూతనోత్తేజం

ఎన్నికల శంఖారావం పూరించిన బీఆర్‌ఎస్



కార్యకర్తల జోష్

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య స్టెప్పులు

- ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్
- తనమార్కు చలోక్తులతో ఆకట్టుకున్న కేసీఆర్
- ఉత్సాహపరిచిన ఎమ్మెల్యేలు, నేతలు
- పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని చేవెళ్ల గడ్డమీద నుంచి పూరించింది బీఆర్‌ఎస్. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపింది. చేవెళ్ల లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి నాయకత్వంలో పెద్ద సంఖ్యలో జనాలను తరలించారు. అసెంబ్లీ ఎన్నికల తరువాత నిరుత్సాహంలో ఉన్న కార్యకర్తల్లో ఈ సభ ద్వారా కేసీఆర్ ఉత్తేజం నింపినట్లయింది. ర్యాంపుపై కేసీఆర్ నడుచుంటూ సభా వేదిక ముందుకు వచ్చి ప్రజలకు అభివాదం చేశారు. తన ప్రసంగంలో ఆద్యంతం చలోక్తులతో ఆకట్టుకున్నారు. సభావేదికపై ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీలు ఎగ్గె మల్లేశ్, సురభి వాణీదేవి, మాజీ ఎమ్మెల్యేలు పైలెట్ రోహిత్ రెడ్డి, మెతుకు ఆనంద్, మహేశ్వర్‌రెడ్డి, రసమయి బాలకిషన్, కర్నె ప్రభాకర్, మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, పార్టీ నేతలు పొన్నాల లక్ష్మయ్య, కార్తీక్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి, పి.కృష్ణారెడ్డి, బాల్‌రాజ్, ప్రభాకర్, స్వప్న, దశరథ్, శ్రీశైలం తదితరులు ఆసీనులయ్యారు.

సభావేదికపై నేతల స్టెప్పులు

రసమయి బాలకిషన్ పాడిన గులాబీ జెండా లమ్మ పాటకు ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యేలు పైలెట్ రోహిత్‌రెడ్డి, మెతుకు ఆనంద్, మహేశ్వర్‌రెడ్డి సభావేదికపై ముందుకు వచ్చి కండువాలు తిప్పుతూ.. స్టెప్పులు వేస్తూ ప్రజలను ఉత్తేజపరిచారు.



సభా వేదికపై పార్టీ నేతలు

కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం

చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. చేవెళ్ల గడ్డ అంటేనే కేసీఆర్‌కు అడ్డా అని.. ఇక్కడ ఆయన నిలబెట్టిన వారిని గెలిపించిన చరిత్ర ఉందని పేర్కొన్నారు. ఈసారి కూడా బీఆర్‌ఎస్ ఎంపీ సీటును గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. ఒక బీసీ నాయకుడిగా బీసీ కులాలను ఏకం చేసేందుకు 93 కులాల ఐక్యవేదికను ఏర్పాటు చేసే ప్రయత్నం చేశానన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉమ్మడి జిల్లా ప్రజలకు సుపరిచితమైన వ్యక్తిగా అభివృద్ధికి కృషి చేశానని తెలిపారు. చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థిగా మాజీ మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు అంతా కలిసి తనకు టికెట్ ఇప్పించారని.. తప్పకుండా చేవెళ్ల సీటును గెలిపించుకుంటామని కేసీఆర్‌కు భరోసా కల్పించారన్నారు. ఎంతోమంది తనకు మద్దతుగా వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, అందరి సహకారాలతో ఎంపీగా గెలిచి కేసీఆర్, ఈ ప్రాంత నాయకులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని చెప్పారు.



అభివాదం చేస్తున్న మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

అన్నీ తానై నడిపించిన సబితారెడ్డి

చేవెళ్ల గడ్డపై అన్నీ తానై ముందుండి ఏర్పాట్లు చూసుకున్న, నేతలను సమన్వయం చేసిన మాజీ మంత్రి సబితారెడ్డి సభా వేదికపై మాత్రం ప్రసంగించలేదు. కానీ మైకు పట్టుకొని సమయం దొరికనప్పుడల్లా జనానికి ఏదో ఒకటి చెబుతూనే ఇతర నాయకులకు అవకాశం కల్పించారు. కేసీఆర్ వచ్చిన తరువాత ఎమ్మెల్యే కాలె యాదయ్యను మాట్లాడాలని చెబుతూ గులాబీ అధినేత కేసీఆర్ చేవెళ్ల గడ్డపైకి వస్తున్నాడని తెలియగానే ఆకాశంలో ఎండ పోయి మబ్బులు పట్టాయని.. అదే విజయమని పేర్కొన్నారు. చేవెళ్ల గడ్డపై మళ్లీ గులాబీ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.



కళాకారుల ఆటపాట



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

మోదీతో దేశానికి పెను ముప్పు

- ఢిల్లీలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తాం
- దివంగత నేత వైఎస్సార్ పాలనలోనే పేదలకు ఇళ్లు
- ఎంపీ రంజిత్‌రెడ్డిది కష్టపడే మనస్తత్వం
- సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

పెద్దేముల్: ప్రధాని మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశానికి పెను ప్రమాదమని.. మత రాజకీయాలు, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే వారిని చిత్తుగా ఓడించాలని సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కందనెల్లి శివారులో గల జీపీఆర్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ తాండూరు నియోజకవర్గ బూత్‌స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మతం పేరుతో రాజకీయాలు చేస్తే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. దేశ భవిష్యత్‌కు వచ్చే లోక్‌సభ ఎన్నికలు కీలకం కానున్నాయని, బీజేపీని ఓడిస్తేనే ప్రజాస్వామ్యానికి మనుగడ ఉంటుందన్నారు. ఎంపీ రంజిత్ రెడ్డి పిలిస్తే పలికే వ్యక్తి అన్నారు. కష్టపడి పనిచేసే మనస్తత్వం ఆయనదని పేర్కొన్నారు. దివంగత నేత వైఎస్సార్ హయాంలోనే పేదలకు మేలు జరిగిందని, ఇళ్లు వచ్చాయని తెలిపారు.

దేశ సమగ్రత విఘాతం: రంజిత్‌రెడ్డి

కేంద్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ దేశ సమగ్రత, సమైక్యతకు విఘాతం కలిగించేలా మతోన్మాదాన్ని పెంచి పోషించిందని ఎంపీ రంజిత్‌రెడ్డి ఆరోపించారు. 30 రోజులు కార్యకర్తలు కష్టపడితే ఐదేళ్లు మీ వెంటే ఉంటామన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని, రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, జాతీయ స్థాయిలో ప్రకటించిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

కొండకు.. కోడికి ఢీ

చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో కొండ (బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి)కు కోడి(రంజిత్‌రెడ్డి)కి సమరమని తాండూరు, పరిగి ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కొండా ఎన్ని అబద్ధాలు చెప్పినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. తాండూరులో రంజిత్‌రెడ్డికి 50 వేల మెజారిటీ రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో తాండూరు ఇన్‌చార్జ్ సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, మాజీ చైర్మన్లు సునిత, లక్ష్మారెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ జెడ్పీటీసీలు రవిగౌడ్, ఆంజయ్య పాల్గొన్నారు.

తాగునీటిపై అపోహలు వద్దు



కొడంగల్: అధికారులతో మాట్లాడుతున్న సుల్తానియా, కలెక్టర్ నారాయణరెడ్డి

- రాష్ట్రంలో పుష్కలంగా మంచినీటి వనరులు
- ప్రతి ఇంటికీ సరఫరా చేస్తాం
- పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా

కొడంగల్/పరిగి: తాగునీటి సరఫరాపై ప్రజలు ఎలాంటి అపోహలకు గురికారాదని, ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే నమ్మవద్దని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా సూచించారు. శనివారం తాండూరు సమీపంలోని కాగ్నా నది పక్కన ఉన్న కొడంగల్ సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి సందర్శించారు. మంచినీటి సరఫరాలో తీసుకుంటున్న చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తాగునీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి అంశం అత్యంత కీలకమని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సరఫరాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు. ప్రతి రోజూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ తాగునీటి సమస్య రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. చేతి పంపులు, బోరు మోటార్లు, పైప్ లైన్ల మరమ్మత్తులు వంటివి సకాలంలో చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించడం జరిగిందన్నారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటున్నట్లు చెప్పారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో పశువుల కోసం నీటి తొట్టెలను ఏర్పాటు చేసేందుకు పశు సంవర్ధక శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. కాగ్నా నది ఇంటెక్ వెల్ నుంచి కొడంగల్, యాలాల మండలాల్లోని పలు గ్రామాలకు మంచినీటిని అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. నీటి స్వచ్ఛతను తెలుసుకునేందుకు ప్రతి గ్రామంలో క్లోరోస్కోప్ కిట్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా వంద కోట్లతో 19,605 చేతి పంపులు, 14,708 సింగల్ ఫేస్, 5 హెచ్‌పీ పంపు సెట్లు, 605 బోర్లు, 662 కిలోమీటర్ల ఇంట్రా పైప్‌లైన్ మరమ్మత్తులు చేసినట్లు చెప్పారు. ఇందులో భాగంగా వికారాబాద్ జిల్లాకు రూ.3.54 కోట్ల నిధులతో 1,044 పంపు సెట్లు, 495 చేతిపంపులు మరమ్మతులు చేయించినట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 23,975 గ్రామాలకు 37,002 ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా ప్రతి రోజూ ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ మంచినీటిని అందిస్తున్నట్లు తెలిపారు. పది రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేసి శుద్ధమైన నీటిని ప్రజలకు అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, మిషన్ భగీరథ ఇంజనీరు ఇన్ చీఫ్ కృపాకర్‌రెడ్డి, చీఫ్ ఇంజనీర్ చెన్నారెడ్డి, ఎస్ఈ ఆంజనేయులు, ఈఈలు బాబు శ్రీనివాస్, చల్మారెడ్డి, జెడ్పీ సీఈఓ సుధీర్, డీపీఓ జయసుధ, డీఆర్‌డీఓ శ్రీనివాస్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

పరిగి: గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశించారు. శనివారం మండలంలోని రాఘవాపూర్‌లో మిషన్ భగీరథ ప్లాంట్‌ను కలెక్టర్ నారాయణరెడ్డితో కలసి పరిశీలించారు.



పుట్టమన్నుకు పూజ చేస్తున్న అర్చకులు

ముగిసిన బ్రహ్మోత్సవాలు

కొడంగల్: పట్టణంలో కొలువుదీరిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఉత్సవాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని సంప్రదాయం ప్రకారం ఎగురవేసిన ధ్వజాన్ని శుక్రవారం రాత్రి కిందకు దింపి విశేష పూజలు చేశారు. యాగశాల నుంచి పూర్ణకుంభం తెచ్చి శ్రీ వేంకటేశ్వర స్వామిని ఆవాహనం చేశారు. దీంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగిశాయని అర్చకులు ప్రకటించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన అర్చకులు ఆగమ శాస్త్రోక్తంగా నిత్య కైంకర్యాలు నిర్వహించారు.

వేసవి భత్యానికి మంగళం?

- మూడేళ్లుగా చెల్లించని దుస్థితి
- సౌకర్యాలు కల్పించక కూలీల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



బొంపల్లి ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

దోమ: గ్రామాల్లో వలసలను నివారించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకం తీసుకువచ్చింది. గ్రామీణులకు స్థానికంగా పని కల్పిస్తూ భరోసా నింపింది. పథకంలో భాగంగా అధిక ఉష్ణోగ్రతల్లో పని చేస్తున్న కూలీలకు ప్రతి ఏటా వేసవి భత్యం, ఇతర సౌకర్యాలను ప్రభుత్వం కల్పించేది. కానీ, వీటి కల్పనా ప్రశ్నార్థకంగా మారింది. ఈ అంశంపై సంబంధిత అధికారులకు ఎలాంటి స్పష్టత రాకపోవడంతో కూలీలకు వచ్చే వేసవి భత్యానికి మంగళం పాడినట్లేనని తెలుస్తోంది. దీంతో కూలీలు అటు వేసవి భత్యం రాక, ఇటు పని ప్రదేశంలో సౌకర్యాలు లేక ఆవేదన చెందుతున్నారు.

కొరవడిన స్పష్టత..

జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లో 566 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 1,18,983 ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉండగా, 2 లక్షల 50 వేల మంది కూలీలు నమోదయ్యారు. ప్రస్తుతం జిల్లాలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులకు సుమారు 38 నుంచి 40 వేల మంది కూలీలు హాజరవుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వేసవిలో కూలీలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఐదు నెలల పాటు కూలీలకు రోజు వారి వేతనానికి అదనంగా 25 నుంచి 30 శాతం వేసవి భత్యం చెల్లించేది. కానీ, గత మూడేళ్లుగా ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో వేసవి భత్యానికి ఇక మంగళం పాడినట్లేనని తెలుస్తోంది.

సౌకర్యాల లేమితో ఇబ్బందులు..

గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే ఉపాధిహామీ కూలీలకు పని ప్రదేశంలో సౌకర్యాలు కరువయ్యాయి. గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరుగుతుండడంతో కూలీలు మండుటెండల్లో పనులు చేస్తూ అల్లాడిపోతున్నారు. పని చేస్తున్న ప్రదేశంలో కనీసం మంచినీరు, మజ్జిగా, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, టెంట్లు, అందుబాటులో లేక పలు చోట్ల కూలీలు అస్వస్థతకు గురవుతున్నారు. గత ప్రభుత్వాలు కూలీలకు టెంట్లు, మంచినీరు, గడ్డపారలు, పారలతో పాటు ఇతర పని ముట్లను అందించేంది. కానీ గత పదేళ్లుగా ఎలాంటి పరికరాలను, సౌకర్యాలను ప్రభుత్వం అందించడం లేదు. దీంతో కూలీలు నానా అవస్థలు పడుతున్నారు. తామే స్వయంగా ఇంటి వద్ద నుంచి పనిముట్లు, నీటిని తెచ్చుకొని పనులు చేయాల్సి వస్తుందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సౌకర్యాలను కల్పించాలని పలు మార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని కూలీలు మండిపడుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు సౌకర్యాలతో పాటు, వేసవి భత్యం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేసవి భత్యం నిలిపివేశారు



ప్రభుత్వం కూలీలకు వేసవిలో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు రోజు వారి వేతనానికి అదనంగా 25 నుంచి 30 శాతం వేసవి భత్యం చెల్లించేది. కాని రెండేళ్లుగా వేసవి భత్యాలను తీసేయడంతో రోజుకు రూ.150 నుంచి రూ.180 మాత్రమే వస్తున్నాయి. దీంతో తమకు గిట్టుబాటు కావడం లేదు. సంబంధిత అధికారులు భత్యం చెల్లించేలా చూడాలి.

–బషీర్, కూలీ, బొంపల్లి గ్రామం

సౌకర్యాలు కల్పించడం లేదు



ఉపాధిహామీలో పని చేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో తగు సౌకర్యాలను కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గతంలో కూలీలకు గడ్డపారలు, పారతో పాటు ఇతర పని ముట్లు ఇచ్చేవారు. కొన్నేళ్లుగా వాటిని నిలిపివేడంతో ఇంటి నుంచి తెచ్చుకుంటున్నాం. పని ప్రదేశంలో మెడికల్ కిట్లు కూడా లేని పరిస్థితి నెలకొంది.

– నర్సయ్య, కూలీ, ఊటుపల్లి గ్రామం

వేసవి భత్యంపై స్పష్టత లేదు



ప్రభుత్వం నుంచి వేసవి భత్యానికి సంబంధించి తమకు ఎలాంటి స్పష్టత లేదు. గతంలో కూలీలకు రూ.272 చెల్లిస్తుండగా ఆ రేట్లను ప్రభుత్వం రూ.300 పెంచింది. పని ప్రదేశంలో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. పాత పనిముట్లను సర్దుబాటు చేసేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించాం. ప్రభుత్వం నుంచి ఎలాంటి సౌకర్యాలు కల్పించినా కూలీలకు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– దస్తయ్య, ఏపీఓ, దోమ.

హత్య కేసు ఛేదించిన పోలీసులు

- హత్యకు దారి తీసిన ఖాళీ ప్రదేశం
- నిందితులకు రిమాండ్



హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ

యాలాల: మండలంలోని పగిడిపల్లిలో ఈనెల 8న జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఇంటి పక్కన ఖాళీ ప్రదేశంతో పాటు పొలం వద్ద కాలిబాట సమస్య వల్ల నెలకొన్న మనస్పర్థలు హత్యకు దారి తీసినట్లు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు తాండూరు డీఎస్పీ బాలక్రిష్ణారెడ్డి, రూరల్ సీఐ అశోక్ కుమార్ శనివారం వెల్లడించారు. మండలం పరిధిలోని పగిడిపల్లికి చెందిన ఎర్ర హన్మప్ప(45), ఎర్ర సమ్మప్ప అన్నదమ్ములు. అయితే, వీరిద్దరికి పొలం వద్ద కాలిబాటతో పాటు ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలం విషయంలో గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఇది మనసులో పెట్టుకున్న సమ్మప్ప ఎలాగైనా హన్మప్పను అంతమొందించాలని మెందించాలని పథకం రచించాడు. ఈ క్రమంలో ఈ నెల 8న మధ్యాహ్నం గ్రామ శివారులోని మర్రిచెట్టు సమీపంలో హన్మప్పను సమ్మప్ప కుటుంబ సభ్యులు అడ్డగించారు. గొడ్డలి, కర్రల సహాయంతో హన్మప్పపై విచక్షణ రహితంగా దాడి చేశారు. ఈ ఘటనలో హన్మప్ప తలకు ఒంటిపై తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సమ్మప్పతో పాటు హత్య విషయంలో నిందితుడికి సహకరించిన బంధువులు ఎర్ర రమేష్(పగిడిపల్లి), గొటిగ రాజు(ఎన్కెపల్లి, బొంరాస్‌పేట మండలం), వుండికూర శేఖర్(అగ్గనూరు), ఎర్ర మొగులమ్మ(పగిడిపల్లి) ఎర్ర బస్వరాజ్(పగిడిపల్లి), మ్యాతరి రమేష్(పేర్కంపల్లి)లుగా గుర్తించి శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో యాలాల ఎస్‌ఐ శంకర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సర్వేంద్రియానాం నయనం ప్రధానం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

షాద్‌నగర్: విద్యార్థులు కంటి సంరక్షణపై నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం షాద్‌నగర్ పరిధిలోని బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కమ్మదనంలోని బాలికల గురుకుల పాఠశాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు కంటి వైద్య నిపుణుడు శ్రీహరి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి సందర్శించారు. అనంతరం విద్యార్థులతో ఆమె మాట్లాడారు. శరీరంలో కళ్లు ఎంతో సున్నితమైనవని అన్నారు. విద్యార్థులు దృష్టిలోపం రాకుండా విటమిన్ ఏ అధికంగా ఉండే ఆహార పదార్థాలు తినాలని సూచించారు.క్యారెట్లు, ఆకుకూరలు, ఉడకబెట్టిన గుడ్లు, పాలు తాగాలన్నారు. అలాగే, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని చెప్పారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుల్లో రాణించగలుగుతారని అన్నారు. 253 మంది విద్యార్థినిలకు పరీక్షలు నిర్వహించగా 17 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించి, షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది అన్నపూర్ణ, సునీత, హేమలత, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు బోల్తా .. ఒకరికి గాయాలు



బోల్తా పడిన కారు

దోమ : ప్రమాదవశాత్తు కారు బోల్తా పడిన ఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గండీడ్ మండలం సల్కర్ పేట్ గ్రామానికి చెందిన డి. వెంకట్‌రాములు చేవెళ్ల ఇరిగిగేషన్ డీఈగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే, శనివారం విధుల్లో భాగంగా చేవెళ్ల నుంచి సల్కర్ పేట్ వస్తుండగా దోమ మండలం గొడుగోనిపల్లి గ్రామ సమీపంలోకి రాగానే ప్రమాదశశాత్తు కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే పరిగి ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు.

నగదు పట్టివేత



స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

దౌల్తాబాద్: మండలంలోని కర్నాటక సరిహద్దు చంద్రకల్ చెక్‌పోస్టు వద్ద శనివారం పోలీసుల తనిఖీల్లో నగదును పట్టుపడింది. కర్నాటక రాష్ట్రం యాదగిరి నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్న సంగన్న రూ.1.50లక్షలు తీసుకెళ్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీశైలంయాదవ్ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు.

విరిగిపడ్డ హైటెన్షన్ స్తంభం



విరిగిపడిన విద్యుత్తు స్తంభం

పూడూరు: హైదరాబాద్– బీజాపూర్ జాతీయ రోడ్డుపై శనివారం 33.11 కేవి హైటెన్షన్ విద్యుత్తు స్తంభం విరిగిపడింది. మన్నేగుడ చౌరస్తాలో ఈ ఘటన జరిగింది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి, స్తంభం రోడ్డుకు అడ్డంగా విరిగిపడినా ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. అప్రమత్తమైన విద్యుత్తు అధికారులు కరెంట్ సరఫరాను నిలిపివేసి కేన్ సహాయంతో రోడ్డుపై నుంచి స్తంభాన్ని తొలగించారు. కావాల్సుకుని హైటెన్షన్ స్తంభం బోల్టులు ఊడదీయడంతోనే స్తంభం విరిగిపడిందని విద్యుత్తు అధికారులు చెప్పారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

ఆటో డ్రైవర్ అదృశ్యం

ఇబ్రహీంపట్నం రూరల్: పనికోసం వెళ్లిన ఆటోడ్రైవర్ ఇంటికి తిరిగి రాలేదు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. బాలపూర్ మండలం, కుర్మల్‌గూడలో నివాసం ఉంటున్న జర్పుల కిష్టు ఆటో నడుపుకుంటూ జీవించేవాడు. రోజులాగే ఆటో తీసుకొని వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కిష్టు భార్య విజయ ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

అనారోగ్యంతో పీఏసీఎస్ మాజీ చైర్మన్ మృతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, మల్లురవి

మాడ్గుల: పీఏసీఎస్ మాజీ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బొజ్జ మోహన్‌రెడ్డి శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి శనివారం ఆయన మృతిదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జీవితాంతం కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలు మరువలేనివని, ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. నివాళులర్పించిన వారిలో నాగర్ కర్నూల్ జెడ్పీవైస్ చైర్మన్ బాలాజీ సింగ్, కాంగ్రెస్ నాయకులు సూదిని రాంరెడ్డి, వెంకటేశ్వర్లుగౌడ్, బట్టు కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

తండ్రి కళ్లెదుటే కొడుకు దుర్మరణం

ఇద్దరికి తీవ్ర గాయాలు



పల్టీ కొట్టిన లారీ



మృతి చెందిన సమ్రాత్



గాయలపాలైన అంబాజీ

ఇబ్రహీంపట్నం రూరల్: కర్నాటక రాష్ట్రం రాయచూర్ నుంచి పెద్దంబర్‌పేట్‌కు ఉల్లిగడ్డ లోడ్‌తో వస్తున్న లారీ అదుపుతప్పి ఔటర్ రెలింగ్‌ను ఢీ కొట్టడంతో కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో ఓ బాలుడు దుర్మరణం చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌పరిధిలో శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. కర్నాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన అంబాజీ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. విఠల్ అనే వ్యక్తి లారీలోడ్ ఖాళీ చేయడానికి హైదరాబాద్‌కు వస్తావాని అడగడంతో సరేనని వచ్చాడు. అతనితో పాటు కుమారుడు సమ్రాత్ కూడా తండ్రి వెంట అదే లారీలో వచ్చాడు. ఔటర్ రింగ్‌రోడ్డు రావిర్యాల సమీపంలోని ఎగ్జిట్ 15 వద్దకు రాగానే డ్రైవర్ ఆ జాగ్రత్త వల్ల లారీ కిందపడింది. రెయిలింగ్‌కు తగలడంతో లారీలో ఉన్న ముగ్గురు అంబాజీ(40), డ్రైవర్ విఠల్(30)లకు కాళ్ళు చేతులు విరిగాయి. అంబాజీ కుమారుడు సమ్రాత్ (13)కు తలకు బలమైన గాయాలు కావడంతో ఘటన స్థలంలోనే దుర్మరణం చెందాడు. క్షతగాత్రులు ఇద్దరు అన్నదములే. వీరిని వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు.

పదేళ్ల తర్వాత పునఃప్రారంభం

- కాగ్నా రక్షిత నీటి పథకానికి పూర్వ వైభవం
- మిషన్ భగీరథకు అదనంగా కాగ్నా



కాగ్నా సంప్ హౌజ్



కాగ్నా వాగు

కొడంగల్: మిషన్ భగీరథ పథకం అందుబాటులోకి రావడంతో నిరుపయోగంగా మారిన కాగ్నా రక్షిత మంచినీటి పథకాన్ని పదేళ్ల తరువాత శనివారం పునఃప్రారంభించారు. తాండూరు, కొడంగల్‌కు మంచినీరు అందిస్తున్న కాగ్నా రక్షిత మంచినీటి పథకాన్ని పక్కన పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి కాగ్నా రక్షిత మంచినీటిని పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దీంతో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిలు శనివారం కాగ్నా రక్షిత మంచినీటి పథకం సంప్ హౌజ్‌ను పరిశీలించారు. నీటి పంపింగ్‌కు తీసుకున్న చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ పథకానికి అదనంగా కాగ్నాను ఉపయోగిస్తున్నట్లు అధికారులు చెప్పారు.

కాగ్నా గురించి..

అప్పట్లో మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోని 39 గ్రామాలకు సమగ్ర రక్షిత మంచినీటిని సరఫరా చేయడానికి కాగ్నా పథకాన్ని రూపొందించారు. సుమారు 30 మంది సిబ్బంది పనిచేస్తుండేవారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడక ముందు కాగ్నా పథకాన్ని ప్రారంభించారు. కాగ్నా వాగు నుంచి మంచినీటిని తీసుకొని కొడంగల్‌లోని సంప్‌హౌజ్‌కు తరలించేవారు. నుంచి గ్రామాలకు సరఫరా చేసేవారు. ప్రతి ఏడాది సుమారు రూ.45 లక్షలను ప్రభుత్వం కేటాయించేది. అప్పట్లో ఈ పథకానికి ఎంతో పేరు ఉండేది. కొడంగల్ సంప్‌హౌజ్‌ను నింపి కొడంగల్‌తో పాటు అంగడిరాయిచూర్, రావులపల్లి గ్రామాలకు తాగునీరు సరఫరా చేసేవారు. కొడంగల్, దౌల్తాబాద్ మండలాల ప్రజల దాహార్తిని కాగ్నా తీర్చేది. ఈ పథకాన్ని తిరిగి ప్రారంభించడంతో కాగ్నాకు పూర్వ వైభవం కల్పించినట్లు అయింది.

20 నుంచి హెచ్‌సీఏ వేసవి శిక్షణా శిబిరాలు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. నగరంలోని ఐదు కేంద్రాల్లో ఈ శిబిరాలను ఏర్పాటు చేశామని, ఇందులో చిన్నారులకు నెల రోజులపాటు ఉచితంగా క్రికెట్‌లో శిక్షణ ఇస్తామని హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్ మోహన్ రావు తెలిపారు. ప్రతి శిబిరంలో 80 నుంచి 100 మందికి అవకాశమిస్తామని... బాలురకు అండర్–14, అండర్–16, అండర్–19 వయో విభాగాల్లో... బాలికలకు అండర్–15, అండర్–19 వయో విభాగాల్లో శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశామని జగన్ మోహన్ రావు వివరించారు. ఆసక్తి గలవారు ఈనెల 15 నుంచి 18వ తేదీలోపు ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. హైదరాబాద్‌లోని ఐదు కేంద్రాల్లో (జింఖానా; మొబైల్: 90301 30346, ఫలక్‌నామా: 98852 95387; అంబర్‌పేట: 98665 82836; లాలాపేట: 99664 62667; మాదాపూర్: 80195 35679) శిబిరాలు నిర్వహిస్తారు. మరిన్ని వివరాల కోసం హెచ్‌సీఏ అధికారిక వెబ్‌సైట్ (http://www.hycricket.orf)ను సందర్శించి, తెలుసుకోవచ్చు.

ధారూరు మార్కెట్‌కు తగ్గిన ఉత్పత్తులు

ధారూరు: ధారూరు మార్కెట్‌కు వ్యవసాయ ఉత్పత్తులు రాక తగ్గింది. శనివారం జరిగిన మార్కెట్‌లో కందులు కేవలం 20 సంచులు మాత్రమే రాగా, క్వింటాల్‌కు రూ.11,400 నుంచి రూ.11,540 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్చి 30న 210 బస్తాల కందులు వచ్చాయి. క్వింటాల్‌కు రూ. 10,210 నుంచి రూ. 10,250 ధరకు కొనుగోలు చేసిన వ్యాపారులు కందుల రాక తగ్గిపోయిందని తెలుసుకుని ఈ వారం ఏకంగా 1,290 వరకు ధరను పెంచి కొనుగోలు చేశారు. ముందుగా అమ్ముకున్న రైతులు అయ్యో రెండు వారాలు ఆగి ఉంటే లాభపడేవారమని వాపోయారు. అలాగే, ఈ వారం మొక్కజొన్న 90 బస్తాలు రాగా, క్వింటాల్‌కు రూ. 2,220 నుంచి రూ. 2,250 వరకు విక్రయాలు జరిగాయని మార్కెట్ కార్యదర్శి సిద్ధమ్మ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

తాండూరు టౌన్ : ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తాండూరు పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పట్టణ ఎస్సై కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొడంగల్ మండలం, టేకులకోడు గ్రామానికి చెందిన డంకూరు చిన్న శ్యామప్ప(63) ఆరోగ్యం బాగాలేదని, ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటానని ఇంట్లో చెప్పి శుక్రవారం తాండూరుకు వచ్చాడు. పట్టణంలోని అవేకా లాడ్జిలో బస చేశాడు. శనివారం ఆయన బాత్‌రూంలోని ఎగ్జిట్ ఫ్యాన్‌కు పంచెతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గమనించిన లాడ్జ్ యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమారుడు ఏడాది క్రితం చనిపోవడం, చిన్న కూతురు ప్రేమ వివాహం చేసుకోవడంతో మానసిక వేదనకు గురై చిన్న శ్యామప్ప ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఆశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మైక్రో ఫైనాన్స్ కంపెనీకి కుచ్చుటోపీ


- నకిలీ బంగారం తాకట్టు
- రూ.28 లక్షల లోన్ తీసుకున్న దుండగులు

ఇబ్రహీంపట్నం : నకిలీ బంగారం కుదవపెట్టి ఓ మైక్రో ఫైనాన్స్ కంపెనీకి కుచ్చుటోపీ పెట్టిన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. తుర్కయంజాల్ ఆశీర్వాద్ మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో పూజారీ శ్రీనివాసులు, గుడ్డిమల్ల మహేష్, షేక్ రహీంపాషా అనే ముగ్గురు వ్యక్తులు 2023 జూలైలో వేర్వేరుగా నకిలీ బంగారం అభరణాలు తాకట్టు పెట్టి వాటిపై రూ.28.82.788 లక్షలు రుణం తీసుకున్నారు. గత అకౌంట్స్‌కు ఈ నెల 2న అధికారులు వచ్చి ఆడిట్ చేశారు. దీంతో రూ.28.82.788 లక్షలకు సంబంధించిన బంగారం లాకర్ తెరిచి చూసి పరిశీలించారు. ఇందులో అన్ని బంగారు నగలు ఫేక్ అని తేలింది. దీంతో మేనేజర్ దుర్గకుంట గొళ్ల చంద్రప్ప ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

వ్యక్తిపై దాడి.. విరిగిన కాలు

ఇబ్రహీంపట్నం రూరల్: మేడపై నిద్రిస్తుండగా బట్టలు ఆరవేసిన నీరు పైన పడుతున్నాయని అడిగినందుకు ఒకరిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసి, దాబా పైనుంచి తోయడంతోకిందపడిపోయాడు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన రాజన్ అనే వ్యక్తి టైల్స్‌వర్క్ చేసుకొని జీవిస్తుండేవారు. రాత్రి డాబా మీద పడుకున్నాడు. అదే పోర్షన్‌లో ఉండే అంకుష్, రమేష్‌లు ఇద్దరు బట్టలు ఆరవేశారు. నీళ్లు పడుతున్నాయని రాజన్ అన్నందుకు ఇద్దరు దాడి చేసి నెట్టడంతో రాజన్ భవనంపై నుంచి కింద పడ్డాడు. దీంతో ఎడమకాలు విరిగింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రసంగాలు.. పదనిసలు!



ప్రజా ఆశీర్వాద సభ ప్రాంగణంలో బీఆర్ఎస్ నేతల కటౌట్లు

చేవెళ్ల: బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో పలువురు నేతలు ఆసక్తికర ప్రసంగాలు చేశారు. వీరిలో కొందరు తడబడుతూ.. తప్పులు మాట్లాడుతూ.. సరిచేసుకునే ప్రయత్నం చేశారు. ముందుగా మాట్లాడిన మండలి చైర్మన్ స్వామిగౌడ్. ఎంపీ నియోజకవర్గం పరిధిలో 6లక్షల బీసీలు అన్నారు. ఇది గుర్తించిన కర్నె ప్రభాకర్ 6లక్షలు కాదు 16లక్షల బీసీలు అని చెప్పటంతో సరిచేసి మాట్లాడారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య, పలువురు నాయకులు మాట్లాడుతూ.. పదేపదే కేసీఆర్‌ను ముఖ్యమంత్రి అంటూ సంబోధించారు. ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. చీము, నెత్తురు ఉంటే బీసీలు చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్‌ను గెలిపించాలని అని తడబడ్డారు. మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. పట్నం కుటుంబ పార్టీ మారడంతో దరిద్రం పోయినట్లు ఉందన్నారు. మాజీ మంత్రి సబితారెడ్డి వద్దని వారిస్తున్నా విమర్శలను కొనసాగించారు.

కాసానిని గెలిపించాలి



దేశంలోని 543 ఎంపీ స్థానాల్లో బీసీలు కేవలం 80 మంది మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. చేవెళ్ల గడ్డపై గెలిచేందుకు కేసీఆర్ ఒక నేతకు అవకాశం కల్పించడం గొప్ప విషయం. దీన్ని సద్వినియోగం చేసుకుని బీసీల సత్తాచాటాలి. పార్టీలకు అతీతంగా ఓట్లు వేసి కాసానిని గెలిపించాలి.

– స్వామిగౌడ్, మండలి మాజీ చైర్మన్

అభివృద్ధి ఘనత కేసీఆర్‌దే



తెలంగాణ రాక ముందు 60 ఏళ్ల పాలనలో జరగని అభివృద్ధిని కేసీఆర్ పదేళ్లలో చేసి చూపించారు. చేవెళ్ల ప్రాంతంలోని ఈసీ, మూసీ నదులపై పది బ్రిడ్జిలు నిర్మించారు. జీఓ 111ను తొలగించి ప్రజలకు మేలు చేశారు. కేసీఆర్ పాలనలో కరెంటు, నీళ్లు ఎలా ఉండేవో..? ఎప్పుడెలా ఉన్నాయో అందరూ గమనించాలి.

– కాలె యాదయ్య, చేవెళ్ల ఎమ్మెల్యే

బీసీలు సత్తా చాటాల్సిన సమయం



బీఆర్ఎస్‌ను వీడే నాయకులతో పార్టీకి ఎలాంటి నష్టం లేదు. కొత్త నాయకులను తయారు చేసుకునే సత్తా పార్టీకి, కేసీఆర్‌కు ఉంది. పట్నం కుటుంబం పార్టీని వీడటంతో దరిద్రం పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు తాగు, సాగు నీటి సంక్షోభం తీసుకురానుంది. బీసీలు సత్తా చాటాల్సిన సమయం వచ్చింది.

– రోహిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే